

# అద్వైతం

## – శారద (బ్రిస్బేన్)

(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

"భానూ! ఏం జరిగింది?"

"అమ్మకి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది అశోక్! హాస్పిటల్‌లో చేర్పించారు. నాన్న హాస్పిటల్లో వున్నారు. మనిద్దరం వెళ్దాం, ప్లీజ్!" మెదడంతా మొద్దు బారినట్టయింది భానుకి.

"అలాగే! నువ్వు కంగారు పడకు."

"పిల్లలని హాస్పిటాల్‌లోకి రానివ్వరేమో!"

"పిల్లలని ఇంట్లో వదిలేద్దాంలే, నువ్వు ముందు తయారవు!"

★★★★★★

2009-జనవరి

"భానూ!"

కళ్ళు మూసుకొని పడుకున్న భాను కళ్ళు తెరిచి చూసింది. మంచం దగ్గర అశోక్, పక్కనే బిక్క మొహంతో పిల్లలూ నిలబడి వున్నారు. వాళ్ళని చూస్తే జాలేసింది. ముగ్గురూ ఆమె పక్కకొచ్చి నిలబడ్డారు.

"లే భాను! కొంచెం అన్నం తిను. నువ్వింత దిగులుగా వుంటే పిల్లలు భయపడుతున్నారు."

భాను కళ్ళు చెరువులయ్యాయి. బ్రెయిన్ స్ట్రోక్ అని ఆస్పత్రిలో చేరిన తల్లి ఆరు నెలలు మృత్యువుతో హోరాహోరి యుద్ధం చేసి, అలిసిపోయి అస్త్ర సన్యాసం చేసింది. తల్లి మరణం కలిగిస్తున్న వేదనలో భాను కృశించి పోతుంటే ఏం చేయాలో తోచడం లేదు అశోక్‌కి.

మూడు నెలల్లో చిక్కి శల్యమైంది. మౌనంగా, డిప్రెషన్‌లోకి కూరుకొని పోతుంది. ఏదో ఆఫీసుకి వెళ్ళొస్తుంది కానీ, మనుషుల్లో పడలేకపోతుంది. స్నేహితులే తప్ప చుట్టాలు ఎక్కువగా లేని కుటుంబం కావడంతో, ఒంటరిగా అనిపిస్తున్నట్టుందామెకి. ఆమె వాలకం చూసి సుమిత్రా, అమూల్యా కుడా భయపడుతున్నారు. ఎలాగో ఆమెని లేపి రెండు ముద్దలు తినిపించాడు అశోక్. అత్తగారు అంత అర్థాంతరంగా మృత్యువు వాత పడటం అశోక్‌కి కూడా బాధగానే వుంది.

తాను ఆమెని మొదటిసారి భాను వెనకాల ఇంట్లోకి నడుస్తూ చూడడం, తన గురించి ఆవిడ కుతూహలం, తమ పెళ్ళికి ముందుగా అభ్యంతర పెట్టినా, తరవాత "మా అల్లుడు ఇంగ్లీషులో పీహెచ్‌డీ చేసాడు," అని గొప్పగా చెప్పుకొని మురిసిపోవడం, అన్ని జ్ఞాపకాలూ అతన్నికూడా బాధ పెడుతున్నాయి. సంతోషమైనా, కోపమైనా మనసులో దాచుకోలేని భోళా మనిషి, అనుకున్నాడు. ఒక్కతే కూతురని భానుని ఎంత కళ్ళల్లో పెట్టుకుని పెంచుకుందో, భాను ఆ ఇంట్లో యువరాణిలా ఎంత గారాబంగా పెరిగిందో అన్నీ తెలుసతనికి. అతనికి తన తల్లి గురించి కూడా భయంగా అనిపిస్తుందీ మధ్య. కానీ, ఎలాగైనా తను మనసు కూడగట్టుకుంటే కానీ, భానుని మళ్ళీ మామూలు మనిషి చేయలేడు.

"భానూ, ఈ నెలాఖరులో జైపూర్ లిటరరీ ఫెస్టివల్ వుంది. నువ్వూ రా, పిల్లలని తీసుకుని వెళదాం. నీక్కొంచెం మార్పు వుంటుంది. జైపూర్ నించి, ఢిల్లీ, ఆగ్రా, అన్నీ చూసొద్దాం. నీక్కొంచెం మార్పు కావాలి."

"అశోక్! అయాం సో సారీ! నేనింత డిప్రెస్డ్‌గా వుండడంతో నీకూ జీవితం ఆగిపోయినట్టయింది." ఇంకా ఏదో చెప్పబోయింది కానీ, గొంతు పెగల్లేదు.

"జీవితం ఎప్పుడూ ఆగిపోదు భానూ! ప్రవాహంలో కొట్టుకొచ్చినవన్నీ కలుపుకొని నిరంతరం ప్రవహించే నది లాటిది జీవితం. ప్రతీ అనుభవాన్నీ కలుపుకొని పోతూనే వుంటుంది. ఈ టైంలో నీకు చాలా సహాయం కావాలి. మరి నీ పక్కనే వుండే మనిషిగా ఆ పని చేయాల్సింది నేనే. కాబట్టి నీ దుఃఖంతో నాకేదో బరువవుతున్నావన్న గిల్టీ ఫీలింగ్ వొదిలేయి. రెండు మూడు వారాలు మనిద్దరం పిల్లలని తీసుకొని తిరిగొద్దాం. లిటరరీ ఫెస్టివల్‌లో నాదొక టాక్ కూడా వుంది. నువ్వు కూడా వొస్తే నాకు చాలా సంతోషంగా వుంటుంది"

భానుకి తనలాగే దుఃఖంలో వున్న తండ్రిని వొదిలి వెళ్ళాలని లేదు కానీ, తనని మళ్ళీ ఎలాగైన మామూలు మనిషిని చేయాలన్న అశోక్ ప్రయత్నాలకి సహకరించాలనీ వుంది. ఎలాగో తండ్రి కోసం వండి పెట్టి, ఇంటి పని చేయడానికి ఒక అమ్మాయిని పెట్టి భర్తతో కలిసి ప్రయాణమైంది భాను.

★★★★★★★★★★★★★★★

"ఇంతకీ నువ్వేం టాపిక్ మీద మాట్లాడుతున్నావు అశోక్?"

"ఎక్స్‌ప్రెషన్, అంటే వ్యక్తీకరణలో బాడీ లాంగ్వేజీ పాత్ర గురించి. మరీ ముఖ్యంగా, భాషా బోధనకీ, నాట్యానికీ వున్న సారూప్యత గురించి." హైదరాబాదు విమానాశ్రయంలో వున్నారు వాళ్ళిద్దరూ పిల్లలతో కలిసి.

"సాహిత్యానికీ నాట్యానికీ ఏమిటి సంబంధం?" ఆశ్చర్యంగా అడిగింది భాను. నవ్వాడు అశోక్.

"సాహిత్యమైనా, నాట్యమైనా, వాటి ప్రధానోద్దేశం ఒక కథని చెప్పడమే కదా? మరి సాహిత్య బోధనలో శారీరక వ్యక్తీకరణ లేకుండా ఎలా? అందుకని బాడీ లాంగ్వేజీ నాట్యానికెంత ముఖ్యమో సాహిత్యానికీ, ముఖ్యంగా సాహిత్య బోధనకీ అంతే అవసరం– అన్నదే నా ప్రతిపాదన."

"కానీ, సాహిత్యం, ఇంగ్లీషైనా తెలుగైనా మాట్లాడేది ఎక్కువగా మగవాళ్ళ గురించి. నాట్యంలోని ఎక్స్‌ప్రెషనేమో చాలా ఫెమినైన్. ఈ రెండిటికీ పొంతన ఎక్కడో నాకైతే అర్థం కావడంలేదు."

"ఎంత తెలివైన మాట చెప్పావు భాను! నువ్వనేది అక్షరాలా నిజం. అందుకనే నా బాధంతా. నాట్యంలోని వ్యక్తీకరణ స్త్రీపరంగా వుండడంతో, నాట్య శాస్త్రాన్ని ఇష్టపడే నాలాటి మగవాళ్ళ గురించి విపరీతమైన వ్యాఖ్యానాలు వినపడతాయి." వాళ్ళ ఫ్లైట్ గురించిన ప్రకటన వినపడడంతో లేచి పిల్లలని తీసుకొని గేట్ వైపు నడిచారిద్దరూ.

తన పేపరు జైపూర్ లిటరరీ ఫెస్టివల్‌లో ప్రసంగానికి ఎన్నికైందన్న ఈ–మెయిలు వచ్చిన రోజున తన డిపార్ట్‌మెంటులో వెక్కిరింపుగా తిరిగిన కనుబొమ్మలు గుర్తొచ్చాయతనికి.

★★★★★★★★★★★★★★★★★★★★★★

ఆ రోజు అతనికి బాగా గుర్తు. స్టాఫ్ రూమంతా పాలూ, టీ, కాఫీల వాసన అలముకుని వుంది. కిటికీలోంచి బయట ట్రాఫిక్కు శబ్దాలు కలిసిపోయిన వాసన, మనుషుల అభిప్రాయాల్లా అంతటా అలముకోని వుంది. తన పేపరు జైపూర్ లిటరరీ ఫెస్టివల్‌లో ప్రసంగానికి ఎన్నికైందని ఎవరికీ చెప్పనేలేదింకా. అయినా, అందరికీ తెలిసిపోయింది. అదికాదు వింత. తాను ఎన్నుకున్న టాపిక్ గురించే అందరి కుతూహలం.

"జైపూర్ వెళ్తున్నరట కదా?" టీలో పంచదార కలుపుతూ అన్నాడు ప్రసాద్. "బాగుంటుంది. అలాటి వేదికల పైన ప్రసంగించటానికి సాహిత్యంతో పాటు పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ టాపిక్స్‌నీ ప్రోత్సహిస్తారు. మీకెలాగూ నాట్యం ఇష్టమే కదా, రెచ్చిపోవచ్చు!" ఏదో కనబడని వెక్కిరింత వుందా ఆయన మాటల్లో? లేక తనే లేని వేళాకోళాన్ని వూహించుకుంటున్నాడా?

"అందులోనూ, ఇలాటి సభల్లో కొత్తొక వింత, కాబట్టి మీ చుట్టూ చాలానే జనం చేరతారు," ప్రొఫెసర్ రావు అన్నాడు. అందరూ ఎందుకో గొల్లుమన్నారు. అంతకు ముందు జరిగిన ఒక డిపార్ట్‌మెంటల్ సెమినార్‌లో తాను సాహిత్యానికీ, సంగీతమూ, నాట్యమూ లాటి పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌కీ వున్న గాఢమైన సంబంధం గురించీ ప్రసంగించాడు. అప్పట్నించీ తనని అందరూ, "ది డాన్సింగ్ టీచర్" అని పిలుస్తున్నారనీ, తనని వేళాకోళం చేస్తున్నారనీ తెలుసు. ఇవన్నీ ఇంట్లో చర్చించే పరిస్థితి లేదు. అమూల్యా, భానూ, అమ్మా, అందరూ ఎవరి లోకంలో వాళ్ళు వున్నారు. కాలేజీ రోజుల స్నేహితుల తరవాత తనకి అంత దగ్గరగా వొచ్చిన స్నేహితులూ లేరు. ఆలోచనల్లోనే నిద్రలోకి జారిపోయాడు అశోక్.

★★★★★★★★★

2010 - జూలై

ఉదయం ఆరు గంటలకి వాకింగ్ ట్రాక్ పైన నడుస్తున్నారు భానూ, అశోక్. ఎలాగైనా కొంచెం ఫిట్‌నెస్ పైన ధ్యాస పెట్టాలని ఇద్దరూ శ్రద్ధగా వాకింగ్ మొదలుపెట్టారు. పదకొండేళ్ళకొచ్చిన భార్గవ్, "నేనూ, చెల్లీ తలుపు

లోపల్నించి గడియ వేసుకొని జాగ్రత్తగా వుంటాం, మీరిద్దరూ వాకింగ్ వెళ్ళండి. అయాం ఎ బిగ్ బాయ్!" అన్న మాటలని తలుచుకుని నవ్వుకున్నారు.

"యేళ్ళు గబగబా గడిచిపోతున్నట్టుంది అశోక్! భార్గవ్ పదకొండేళ్ళ పిల్లాడు. మొన్న నాకు వికీపీడియా ఎలా వాడాలో చూపించాడు తెలుసా?"

"అవునా? నిన్న వాడి పుస్తకాలు తీసి చూస్తే, ఒక ఇంగ్లీషు సినిమా గురించి రివ్యూ రాసాడు, ఎంత బాగా రాసాడనుకున్నావ్?"

"ఇంగ్లీషు సినిమానా? ఏ సినిమా? ఎప్పుడెళ్ళాడు? ఎవరితో వెళ్ళాడు? నాకు తెలియకుండానా?" ఆశ్చర్యంగా గబగబా అడిగింది భాను.

"కొన్ని నెలల క్రితం చిల్డ్రెన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరిగింది గుర్తుందా? వాళ్ళ స్కూల్ టీచర్ నాలుగైదు సినిమాలకి తీసికెళ్ళింది వాళ్ళని. నువ్వప్పుడు మీ నాన్నగారితో అక్కడ వున్నావ్. అందుకే తెలియలేదు. అప్పుడు చూసిన సినిమాల గురించి రాసాడు. అంతే కాదు, సెప్టెంబరులో వైయెస్సార్ హెలికాప్టర్ క్రాష్‌లో మరణించడం గురించి ఒక చక్కటి కవిత కూడా రాసాడు."

"ఇంకేం, నీలాగే ఇంగ్లీషు ప్రొఫెసర్‌ని చేసేద్దాం వాణ్ణి కూడా!"

"ఒకటి, నేనింకా అసోసియేట్ ప్రొఫెసర్ మాత్రమే. రెండు, మన జెనరేషన్‌లోనంటే ఏదో నువ్వు దయతలచి పెళ్ళి చేసుకున్నావు. ఇప్పుడైతే ఇంగ్లీషు లిటరేచర్ చదివే పిల్లవాడికి పెళ్ళే కాదు!"

"అంతేనంటావా? నేనింకా కాలం చాలా మారిందని అనుకుంటూ వున్నానే!"

"నీకసలు మీ ఆఫీసులో వుండే కంప్యూటర్లూ, వాటిల్లో నువ్వు వాడే క్వాలిటీ కంట్రోలు సాఫ్ట్‌వేర్ తప్ప బయటి ప్రపంచం తెలుసని నేననుకోను!"

"హౌ రూడ్! నాకంటే నీకంతగా తెలిసిన ప్రపంచం ఏమిటీ చెప్పు, నేర్చుకుంటాను!"

"నేనది కాంప్లిమెంటుగా అన్నా! నువ్వు చాల ఫోకస్‌తో పని చేసే ప్రొఫెషనల్‌వి. నీ వృత్తి పైనే నీ ధ్యాసంతా. దాంతో నీకి బయట జరుగుతున్న విషయాల పట్ల పెద్ద శ్రద్ధ వుండదు. దానికి తోడు పుస్తకాలు చదవమని ఎంత చెప్పినా వినవు!"

"అబ్బా! మళ్ళా మొదటికొచ్చింది!" పుస్తకాల మాట రాగానే విసుక్కుంది భాను.

"అసలు సీ.యెస్. లూయిస్ ఏమన్నాడో తెలుసా?"

"నాతోనైతే ఎమీ అనలేదు. నీతోటేమన్నాడో నాకెలా తెలుస్తుంది?" పెంకిగా అంది భాను.

"పిచ్చి జోకులాపు! పిల్లలతో కలిసి 'ది లయన్, ది విచ్ ఎండ్ ది వార్డ్‌రోబ్' సినిమా చూడలే? ఆ నార్నియా కథల రచయిత సీ.యెస్. లూయిస్ . ఇంతకీ ఆయనేమన్నాడంటే, 'నాకున్న రెండు కళ్ళూ నాకు చాలవు. పక్క వాళ్ళందరి కళ్ళూ కలిపి చూస్తే కాని సరిపోదూ అని అన్నాడు."

"అబ్బ, యేదోలే. నాకంత డీప్‌గా మాట్లాడితే అర్థం కాదు. ఆగు, ఇంటికెళ్ళేటప్పుడు పచ్చి మిరపకాయలు కొనడం మరిచిపోకు. అమ్మో ఒక పాల పాకెట్టు కూడ తెచ్చి ఇమ్మంది!"

"అలాగే కొందాం. అమ్మో, రామకృష్ణా హాయిగానే వున్నారు కదా?"

"వాళ్ళ పెళ్ళయి ఆరునెలలయిపోయిందప్పుడే! నాకయితే ఇద్దరూ సరదాగా బాగున్నట్టే అనిపిస్తుంది. చక్కగా ఏ హడావిడీ లేకుండా రిజిస్టర్ మేరేజీ చేసుకున్నారు. అమ్మో కూడా చిన్నప్పట్లా మామూలుగా మాట్లడగలుగుతూంది ఇప్పుడు. అసలు మన గృహప్రవేశం రోజు రామకృష్ణని చూసి, అమ్మోకి పరిచయం చేయమని సలహా ఇచ్చింది మా అమ్మే! ఇప్పుడు వాళ్ళిద్దరినీ చూసి సంతోషించేది బహుశా" భాను అంది బాధగా. ఆమె చేయి తన చేతిలోకి తీసుకొని ప్రేమగా నొక్కాడు అశోక్.

"అవును, నాకూ చాలాసార్లు ఆంటీని మిస్సవుతున్నట్టు అనిపిస్తుంది. మావయ్యగారెలా వున్నారు?"

"బానే వున్నారు. వంట మనిషి వొచ్చి వండి పెడుతూ వుంది. పేపరు చదువుతూ, టీవీ చూస్తూ ఏదో కాలక్షేపం చేస్తున్నారు. అసలు, నాన్నని కూడా మన ఇంటి దగ్గరలో ఒక ఇల్లు తీసుకొమ్మని చెప్పాను. కానీ, ఆయన వినరు. అక్కడే బాగుంది అంటారు." ఇద్దరూ ఇంటికెళ్ళేసరికి ఏడు దాటనే దాటింది.

"ఇప్పుడు పిల్లలని లేపి ముందు వాళ్ళని రెడీ చేసి నేను తయారయి ఆఫీసుకెళ్ళాలి. అశోక్, పిల్లల డబ్బాలు సర్దేయవా ప్లీజ్!" ఇల్లు చేరుతూ వుండగానే భానులో టెన్షన్ పెరిగిపోసాగింది.

"అలాగేలే! నువ్వసలు అంత టెన్షన్ పడకు. నిన్ను తొమ్మిదింటికల్లా మీ ఆఫీసు బస్ స్టాప్ దగ్గర దించేస్తాను, సరేనా?" ఇంట్లోకి వెళ్ళేసరికి భార్గవ్ యూనిఫార్మ్ వేసుకుని పుస్తకాలు సర్దుకుంటున్నాడు.

★★★★★★★★★★★★★

"అమ్మో, నాకు ఒక కంప్యూటర్ కొనివ్వాలి ఈ ఇయర్!" ఆ రాత్రి అన్నాల దగ్గర అన్నాడు భార్గవ్.

"వేలెడు లేవు, ఆరో తరగతికి నీకెందుకురా కంప్యూటర్?" అన్నది సుమిత్ర ఆశ్చర్యంగా.

"నువ్వుండు నానమ్మో, నీకర్థం కాదు!"

"మైండ్ యువర్ టంగ్ యంగ్ మాన్! ఆమెకేమీ తెలియకపోవడం ఏమిటి? నీలాటి బచ్చా గాళ్ళందరికీ పాఠాలు చెప్పింది మా అమ్మ!"

"ఒకే, సారీ నానమ్మో! ఇంతకీ కంప్యూటర్ మాటేమిటి?"

"కంప్యూటర్‌తో నీకేం పని?" ఈసారి అశోక్ నిజంగానే కుతూహలంగా అడిగాడు.

"యెందుకంటే, మా క్లాసు అసైన్‌మెంట్స్ చేయడానికి కావాలి. నాన, ప్లీజ్ నానా!"

"నానా ప్లీజ్ నానా! నాక్కూడా ఒక కంప్యూటర్ కావాలి!" ఎనిమిదేళ్ళ అనఘ కూడా వెంట పడింది.

"వీళ్ళ చదువులేమో కానీ మనం దివాలా తీసేటట్టు వున్నాం!"

"కంప్యూటర్‌కి ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకుంటే ఎన్నెన్నో నేర్చుకోవచ్చు. బోలెడు సినిమాలు చూడొచ్చు!" భార్గవ్ ఉత్సాహంగా అన్నాడు.

"యేమిటీ? ఇంటర్‌నెట్ కనెక్షన్ తీసుకుంటే సినిమాలు చూస్తావా? టీవీలో వచ్చే దరిద్రపు సినిమాలు చూస్తున్నది చాలదా?" చిరాగ్గా అన్నది భాను.

"నేననేది ఆ సినిమాల గురించి కాదమ్మా! నాన్నతో పాటు వెళ్ళి ఫిల్మ్ క్లబ్‌లో చూస్తాం చూడు? ఇంటర్నేషనల్ సినిమా! అటువంటివి. లాస్ట్ ఇయర్ మా క్లాసువాళ్ళతో వెళ్ళి ఎన్నెన్ని మంచి సినిమాలు చూసానో!"

"యేమేం సినిమలు చూసావు?" కుతూహలంగా అడిగింది భాను.

"పేర్లు గుర్తు లేవు కానీ, ఒక చైనీస్ సినిమా, ఒక జర్మన్ సినిమా చూసాను."

"నీకెలా అర్థమయ్యాయి ఆ సినిమాలు? తెలుగులోకో హిందీలోకో డబ్బింగ్ చేసారా?"

"డబ్బింగ్ కాదమ్మా! ఇంగ్లీషులో సబ్‌టైటిల్స్ వుంటాయిగా?"

"మరి సబ్‌టైటిల్స్ నువ్వు వేగంగా చదవగలిగావా?"

"అంతా చదవలేననుకో. కానీ, సినిమా బానే అర్థమైంది. చైనీస్ సినిమాలో అమ్మాయికి చేతులే వుండవు కానీ స్విమ్మర్ అవుతుంది. ఆ సినిమా చూస్తూ మా ఫ్రెండ్స్ ఎంత మంది ఏడ్చారో తెలుసా?"

"మరి నీకేమనిపించింది ఆ సినిమా చూస్తే?"

"నాకా? నాకేమనిపించిందంట్." కొద్దిసేపు ఆలోచించి, మాటలన్నిటినీ కూడగట్టుకుంటున్నట్టు చెప్పాడు.

"నాకేమనిపించిందంటే, ఏ భాష మాట్లాడినా, ఎక్కడ వున్నా, బాధనిపించినప్పుడు అందరమూ ఏడుస్తాం కదా, అనిపించింది."

వాడి చిన్న మనసులోంచి పుట్టుకొచ్చిన పెద్ద ఆలోచన చూసి భాను కళ్ళల్లో నీళ్ళూరాయి.

"ఇంకా, నీకింకే సినిమాలు నచ్చాయి?"

భార్గవ్‌కి అమ్మా నాన్న తనని పెద్దవాళ్ళనడిగినట్టు అభిప్రాయం అడగడం గొప్పగా, సరదాగా అనిపించింది. ఎక్సైట్‌మెంటుతో వాడు కుర్చీలోంచి దిగి నిలబడి చెప్పాడు.

"నాన్నా! నాకు ఇంకో సినిమా, దాని పేరు, ఆ..,'ది లెటర్ ఫర్ ది కింగ్'. ఆ సినిమా కూడా చాలా నచ్చింది. అందులో ఒక బ్రేవ్ వారియర్ వుంటాడు. కానీ ఆ సినిమా ఫైటింగ్ గురించి కాదు." ఎంతో గొప్ప రహస్యం చెప్తున్నట్టు వాడి కళ్ళు మెరిసాయి

"మరి దేని గురించి?"

"ఆ సినిమాలో భయం వేసినా సరే, తప్పు పని చేయకూడదని చెప్పారు."

"అయితే మరి, ఈ సినిమాలన్నీ నీకెందుకు నచ్చాయి?"

భార్గవ్ మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. రెండు క్షణాలాగి చెప్పాడు.

"ఎందుకంటే, ఆ సినిమాలు చూస్తున్నప్పుడు నాకు ఆ కంట్రీస్ అన్నీ నేను వెళ్ళి చూస్తున్నట్టు అనిపిస్తుంది. అక్కడి పిల్లలందరూ నాలాంటి వాళ్ళే. వాళ్ళకీ ఇక్కడ మాకులాగే అసైన్‌మెంట్స్, టెస్టులూ, అమ్మా, నాన్నా, టీచర్లూ అన్నీ వున్నాయి. అందరం ఒకలాగే అనిపిస్తాం నాన్నా!"

"నేను చెప్పినట్టు వీడిదంతా నీ పోలికే అశోక్! మనింట్లో ఇంకో ఇంగ్లీషు టీచరు ఖాయం! నాకేమో తెలుగే సరిగ్గా రాదు!" భాను మాటలకి అశోక్, సుమిత్రా నవ్వేసారు.

★★★★★★★★★★★★★★★★★★★★

## 2011 - డిసెంబర్

మినర్వాలో కారు పార్క్ చేసి లోపలికొచ్చింది భాను. డిసెంబరు నెల రాత్రి చల్లచల్లగా అనిపించింది. స్వెట్టరు కొంచెం దగ్గరగా లాక్కుంది.

"సారీ, సారీ! చాలా లేటయ్యానా?", అప్పటికే అక్కడికొచ్చిన కోమలీ, సూసీ, ఆశాలని చూసి అంది. వాళ్ళ జవాబు కోసం ఆగకుండా, బాగు కింద పడేసి గ్లాసులో మంచి నీళ్ళు పోసుకోని గబ గబా తాగింది.

"ఆశా, ముందు నాకో కాఫీ తెప్పించవే! తరవాతే మాటలైనా, కబుర్లైనా!"

"శనివారం కూడా అంత బిజీ యేంటే భానూ?"

"ఆఫీసుకి సెలవే, కానీ, పర్సనల్ పనులు చాలా చక్కబెట్టాల్సొస్తుందే! నాన్న ఒక్కరే వుంటారు హిమాయత్‌నగర్ ఇంట్లో. వారానికొకసారి వెళ్ళి సామాన్లవీ సర్ది, ఆయన్ని చూసి వస్తాను. నిజానికి పాపం ఆయన వొద్దనే అంటారు, కానీ నాకే మనసాగదు. అమ్మ పోయినతరవాత ఆయన చాలా ఒంటరైపోయారు. నువ్వు చెప్పవే సూసీ, ఎలా వున్నావ్?"

"బానే వున్నానే! ఆస్ట్రేలియాలో మా వూళ్ళో ఒక చిన్న డాన్స్ స్కూల్ ప్రారంభించా ఈ యేడు. అది ఇంకొంచెం పుంజుకుంటే ఉద్యోగం మానేయాలనుంది. మేము ఒక పాపని పెంచుకోవాలనుకున్నామని చెప్పా కదా? బహుశా ఆ పని కూడా అయిపోవచ్చు. నిజంగా మా అదృష్టం బాగుండి పాపాయిని పెంపకానికిస్తే, ఇంట్లోనే వుండిపోతాను."

పిల్లల కోసం సూసీ, శివ ఎంత తపన పడ్డారో వాళ్ళందరికీ తెలుసు. రెండేళ్ళ క్రితం అడాప్షన్ యేజెన్సీకి దరఖాస్తు చేసుకుంటే, ఇప్పుడు ఫలితం దక్కేలాగుంది.

"కోమలీ, నీ విశేషాలేమిటే?"

"ఏమీ లేవు ఆశా, అమ్మా నాన్న అన్నయ్య దగ్గరుంటున్నారు. ఇక్కడ మా ఇంట్లో నేనొక్కదాన్నే. నేనెటు ఒంటరిగానే వుంటా కదా, అమ్మా నాన్నా నాతోనే వుంటే బాగుందని మా వదిన అభిప్రాయం. నేనూ అదే అంటాను, కానీ వాళ్ళే ఎక్కువగా అక్కడే వుండడానికిష్ట పడతారు. నేను పెళ్ళి చేసుకోలేదని అమ్మకి బాధ. అది నా దగ్గరుంటే ఆ బాధ ఎక్కువవుతుంది. నా దగ్గరుంటే ఆ బాధ ఎక్కువవుతుంది. చిన్నప్పుడు అందరమూ ఎంత కలిసి మెలిసి వున్నా, పెద్దయ్యాక ఎవరి ప్రపంచంలోకి వాళ్ళం జారిపోతాం కదా, అనిపిస్తుంది కొన్నిసార్లు, మా కుటుంబాన్ని చూస్తే!"

'పోనీ, పెళ్ళి చేసుకోవచ్చుగా కోమలీ! నీ ఒంటరితనమూ తగ్గుతుంది," ఆశా కొంచెం సందేహంగా అంది. నవ్వింది కోమలి.

"నాకే ఒంటరితనమూ లేదు ఆశా! మంచో చెడో, నేనొక భిన్నమైన పద్ధతిలో జీవిస్తున్నాను. ఆ పద్ధతిని అంగీకరించే మనిషి నాకింతవరకూ తారసపడలేదు. అనవసరంగా నా ఇష్టా ఇష్టాలకి ఇంకొకరిని బందీని చేయడం నాకిష్టం లేదు. అలాగని నా పద్ధతి మార్చుకోవడమూ ఇష్టం లేదు. అయాం రియల్లీ ఫైన్. సంతోషంగా, ప్రశాంతంగా వున్నాను."

"భిన్నమైన పద్ధతా? అంటే?" సూసీ ఆశ్చర్యంగా అడిగింది.

"అంటే పెద్దగా ఏమీ లేదు. నాకవసరమైనంత మాత్రమే జీతమిచ్చే చిన్న టీచరుద్యోగం చేస్తున్నాను. చిన్న అద్దె ఇంట్లోకి మారదామనుకున్నా, కానీ నాన్న ఈ ఇంట్లోనే వుండి దీని బాగోగులు చూడమన్నారు. సరే అని ఇందులో వుంటున్నా. వీలైంత సరళంగా, తక్కువ వస్తు వినిమయం చేస్తూ, ప్రశాంతంగా, నిశ్శబ్దంగా బ్రతకడానికి ప్రయత్నిస్తున్నాను!"

ఎవరికీ ఏం మాట్లాడాలో తోచలేదు. సీరియస్‌గా మారిన మూడ్ ని చూసి నవ్వింది కోమలి.

"యేదో ట్రాజెడీ సినిమా చూస్తున్నట్టు ఆ మొహాలేంటే? నిజం చెప్తునాను, నేను హాయిగా వున్నా! యేవేవో ఊహించుకొన్ని బాధపడకండి, మా అమ్మలాగా! ఆవిడైతే నాకేదో కాన్సర్‌లాటి భయంకరమైన వ్యాధి సోకిందనీ, సినిమా హీరోయిన్‌లాగా నేను రహస్యంగా చెంగు నోట్లో కుక్కుకొని యేడుస్తున్నాననీ ఊహించేసుకుంటోంది. అదేదీ లేదు, ఆరోగ్యంగా దుక్కలా వున్నానని ఎన్ని ఒట్లేసినా నమ్మడం లేదు!"

అందరూ నవ్వేసారు.

"ఆశా, నా కొడుకంతా నీ పోలికేనే!" భానూ అంది ఆశా వైపు తిరిగి.

"నా పోలికేంటే?"

"సినిమా పిచ్చి తల్లో! తమరు తెలుగు, హిందీ అయితే, వారు ఇంగ్లీషు, జర్మన్, చైనీస్, జపనీస్ సినిమాలు. అన్ని ప్రపంచ భాషల్లో సినిమాలంటే వాడికి పిచ్చి! అసలు వాడికెన్ని తెలివితేటలనుకున్నారు? పన్నెండేళ్ళే అయినా, వాడు

ఆ సినిమాల గురించి చేసే వ్యాఖ్యలూ, చుట్టూ వున్న మనుషుల గురించి పట్టించుకునే వాడి సింపతీ, వీడేదో పెద్ద రచయిత అవుతాడేమోననిపిస్తుంది. లెక్కలు మాత్రం ఒంటబట్టవు రాజావారికి! పదో తరగతిలో పరువు తీస్తాడో యేమోనని భయపడి చస్తున్నాం నేనూ, అశోకూ!"

తమ గురించి తక్కువగా, తలి దండ్రుల గురించీ, పిల్లల గురించీ యెక్కువగా మాట్లాడుకునే ఫేజ్‌లోకి, వయసులోకీ వారికి తెలియకుండానే వాళ్ళు జారిపోయారు!

★★★★★★★★★★★★★★★★

## 2012-జూన్

ఎంత ఎయిర్ కూలర్ వేసినా, గదిలో వేడి అలాగే వుంది. రాత్రి ఏడు గంటలు కావస్తున్నా ఏ మాత్రం చల్లబడలేదు. భాను లేచి విసుగ్గా కిటికీ తెరిచింది.

"ఆ కిటికీ తెరుస్తే గాలి తక్కువా, దోమలెక్కువా లోపలికొస్తాయి!" దిద్దుతున్న పేపరు పక్కన పెట్టి, తల పైకెత్తాడు అశోక్.

"అందుకే, ఈ కుకట్‌పల్లి అపార్ట్‌మెంట్ అద్దెకిచ్చి, ఒక విల్లా కొందామని మా ఆఫీసులో లోను కొరకు ప్రయత్నిస్తున్నాను," భాను అంది, డైరీలో ఏదో ఫోన్ నంబరు వెతుకుతూ.

"కరెక్టే కానీ, మనిద్దరమూ నలభై యేళ్ళకొచ్చాం భానూ! ఇప్పుడు లోన్ తీసుకొని మరీ ఇంకో ప్రాపర్టీ కొనడం అవసరమా? ముందు ముందు పిల్లలు యెదిగొస్తున్నారు. వాళ్ళ చదువులూ, పెళ్ళిళ్ళూ! లోన్ తీసుకునేముందు ఇంకొంచెం ఆలోచించు."

"అవును అశోక్! కానీ, ఇంకో నాలుగైదేళ్ళు పోతే ఈ లోన్ దొరికే అవకాశం కూడా వుండదు. ఎప్పటికీ ఇలాగే మిగిలిపోతాం. ఇంకొంచెం విశాలంగా వుండే ఇల్లు, గేటెడ్ కమ్యూనిటీలో, మా అఫీసు వాళ్ళకి కొంచెం తక్కువ ధరలో ఇస్తున్నారు. లెట్ మీ ట్రై."

నిట్టూర్చాడు అశోక్. నిజానికి భాను పెద్దగా కోరికలేవీ పెట్టుకోదు. చీరలనీ, నగలనీ పెద్ద వ్యామోహాలు లేని మనిషి. కానీ ఒక యేడాదిగా ఇంకొంచెం మంచి ఇల్లు కావాలన్న ఆశ ఆమెని నమిలేస్తుంది. లోన్ దొరికే మాట నిజమే అయినా, ఆ లోన్ తీర్చాలన్న భయానికి తన ఆరోగ్యం లెక్కచేయకుండా, సెలవులు పెట్టకుండా పని నెత్తినేసుకుంటుంది. మామగారు సహాయం చేస్తానంటారు, కానీ ఆయన దగ్గర చేయి చాచటం తనకీ, భానుకీ కూడా ఇష్టం వుండదు. అసలు భాను తమ డబ్బు ఇబ్బందులు దగ్గరి స్నేహితులతో కూడా చెప్పదు. ఇప్పుడీ ఇంటి కోరిక భాను వ్యక్తిత్వాన్ని మార్చబోతుందా? నిట్టూర్చి, పేపర్ల కట్ట పక్కన పెట్టి పిల్లల వైపు చూసాడు అశోక్.

భార్గవ కింద నేల మీద లాప్‌టాప్ లో ఏదో చూస్తున్నాడు. స్క్రీన్ ఫ్రీజ్ అయి వుంది. శ్రద్ధగా సబ్‌టైటిల్ చదువుతున్నాడు.

"అమ్మా, ఈ సినిమాలో ఒక చిన్న పిల్లాడు తన అమ్మా–నాన్నలకి సహాయ్మ్ చేయడమా, లేక ఒక స్ట్రేంజర్‌కి హెల్ప్ చేయాలా అని ఆలోచిస్తున్నాడు. ఏది కరెక్టా అని ఇందాకట్‌నించీ ఆలోచిస్తున్నా! ఐ డోంట్ నో ది అన్సర్. అరె, ఈ వూళ్ళో అన్నీ చిన్న చిన్న ఇళ్ళే!" వాడి మాటలకి నవ్వొచ్చింది అశోక్‌కి.

పక్కనే అనఘ బొమ్మల పుస్తకంలో రాజకుమారి బట్టలకి పింక్ రంగు పులుముతోంది. ఇప్పటికే ఆ రంగు బాగా దట్టమైంది.

"నాకైతే సినిమాల్లో పాటలుంటే ఇష్టమబ్బా!" అంది ఎవరూ అడగకపోయినా.

"పాటలుంటే చాలా? రాజకుమార్తెలొద్దా?" భార్గవ అన్నాడు వేళాకోళంగా. అనఘ కోపంగా వాడికేసి చూసి, మళ్ళీ బొమ్మల పుస్తకంలో మునిగి పోయింది.

భాను మాట్లాడడం ముగించి ఫోన్ పెట్టేసింది.

"అశోక్, మనకి ఫేజ్ టూ లో ఒక ఇల్లు అలాట్ చేస్తారట. ఈలోగా లోన్ కూడా క్లియర్ అవుతుంది. ఇంకేమైనా తక్కువైతే నా నగలన్నీ అమ్మేస్తాను." కొన్నిసార్లు భాను తననీ, తన జీతాన్నీ లెక్కలోకి కూడా తీసుకోదు, అనుకున్నాడు అశోక్, చివుక్కుమన్న మనసుతో.

కానీ తన బాధ కూడా నిజమే. కూకట్‌పల్లి నించి రోజూ ఆఫీసుకి వెళ్ళి రావడం అవస్థగా వుంది ఇద్దరికీ. ఈ కమ్యూనిటీలో ఇల్లైతే, తనకి ఇన్స్టిట్యూట్‌కి దగ్గరా, భానుకి ఆఫీసు ట్రాన్స్‌పోర్టు! భాను కోరికైనా, తమ కుటుంబం కోసమే కదా!

"కొత్త ఇంట్లో నాకు ఒక రూం కావాలమ్మా, ప్లీజ్! అయాం టర్నింగ్ థర్టీన్! ఐ నీడ్ స్పేస్," భార్గవ్ అన్నాడు గంభీరంగా.

"స్పేస్ కంటే ముందు తమరిక్కావాల్సింది మార్కులు!" భాను మాటలకి వాడి మొహం చిన్నబోయింది.

"భానూ! వాడు టీనేజర్ కాబోతున్నాడు, చాలా సెన్సిటివ్‌గా వుంటాడు. వాణ్ణలా చిన్నబుచ్చకు," మొబైల్ ఫోన్‌లో మెసేజీ టైప్ చేసి పంపాడు అశోక్. మెసేజీ చూసుకుని అతని వైపు చూసింది భాను. ఆమెకీ నిజమే అనిపించింది. చేతిలో ఫోనూ, ఫైలూ అన్నీ పక్కన పెట్టేసి నేల మీద వాడి పక్కనే కూర్చుంది.

"ఏం సినిమా చూస్తున్నావ్ నాన్నా? నాకైతే అర్థం కూడా కావు! యూ ఆర్ సో స్మార్ట్! నాక్కొంచెం హెల్ప్ చేయవా? టు అండర్‌స్టాండ్?" వాడితో పాటు లాప్‌టాప్ లోకి చూస్తూ అన్నది. వాడి మొహం వెలిగిపోయింది.

అమ్మ అన్నయ్యకి అటెన్షన్ ఇవ్వడమ్ అనఘకేమీ నచ్చలేదు.

"అమ్మా, ఈ ప్రిన్సెస్ బొమ్మ చూడు!" అమ్మ ఒళ్ళోకెగబాకింది.

"అనూ! నువ్వు నాకు హెల్ప్ చేయి. కొత్త ఇంటికోసం మనిద్దరం 'ఏబీబీఏ' బోర్డు తయారు చేద్దాం," అశోక్ కూతుర్ని అక్కణ్ణించి లేవదీసి ఒళ్ళోకి తీసుకున్నాడు.

"ఏబీబీఏ అంటే, ఆబా! ఆబా అంటే మ్యూజిక్ గ్రూపు కదా? మనింటిముందు ఆబా బోర్డెందుకు నాన్నా?" భార్గవ అడిగాడు.

"ఏబీబీఏ అంటే ఆబా కాదమ్మా, అశోక్, భాను, భార్గవ్, అనఘా."

తండ్రి మాటలకి పిల్లలిద్దరూ గొల్లుమన్నారు.

"నానా! యూ ఆర్ సో ఫన్నీ!" తండ్రి మెడ అల్లుకుపోయింది అనఘ.

భానుకేసి గర్వంగా చూసాడు అశోక్.

********************

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS